


# భట్టిప్రోలు కథలు

దాసరి దానమ్మ కొడుకు సోమయ్య పెళ్ళి ఎలాగైతేనేం
కోళ్ళపాలెంలో ఉండే బుడ్డా బుచ్చయ్య రెండో అమ్మాయి సుశీలతో నిశ్చయమైంది.
దానమ్మ కొడుకు పెళ్ళికి అమ్మాయి కోసం తిరగని ఊరు లేదు. అటు పొన్నూరు నుంచి చెరకుపల్లి దాకా..
ఇటు రేపల్లె నుంచి తెనాలి దాకా.. వెల్లటూరి కిందున్న లంకలన్నీ కాలికి బలపం కట్టుకుని తిరిగింది.

# అమ్మ వచ్చిందా?

## డాక్టర్ నక్కా విజయరామరాజు

దానమ్మ భర్త దాసరి పిచ్చయ్య మంగళగిరి టి.బి.శానిటోరియంలో క్షయ జబ్బుతో చనిపోవడంతో ఇంటిపనంతా ఆమె మీదే పడింది. ఏదోలాగా సోమయ్యని పదో తరగతి దాకానన్నా చదివిద్దామనుకుంది గానీ.. ఏడో తరగతి దాట్టమే కష్టమైపోయేసరికి గొడ్లు కాచుకురావడానికి అత్తలూరి గోపాలరావు గారి దొడ్లో పెట్టింది.

ఆ దొడ్లోనే పెద్ద జీతగాడై మినప బస్తా పళ్ళతో బిగించి చేత్తో పట్టుకోకుండా కళ్ళం చుట్టూ.. తిప్పేటంతా బలమూ వచ్చింది. దండి బస్కీలు వందదాకా ఆపకుండా తీసేవాడు.

సోమయ్య ఈడు కుర్రాళ్ళంతా పెళ్ళిళ్ళు చేసుకుని కాపురాలు చేసుకుంటూ పిల్లల్ని కంటుంటే దానమ్మకి కొడుకు గురించి దిగులుపట్టుకుంది. కూతురు సొరాజ్యం పెళ్ళి భర్త బతికుండగానే జరిగిపోయింది. కాబట్టి ఆమె గురించి దిగులు లేదు. దాసరి పిచ్చయ్య టి.బి. జబ్బుతో చనిపోయాడు కాబట్టి.. ఆ జబ్బు సోమయ్యకు కూడా ఉందేమోనని కొందరు పిల్లనివ్వటానికి జంకితే... వీరి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటంతో చుట్టాలు కూడా పిల్లనివ్వడానికి మొహాలు చాటేశారు.

ఏది ఏమైనా సోమయ్య పెళ్ళి కుదిరినందుకు దానమ్మ ఆనందం అంతా ఇంతా కాదు. ఇంటికి పెళ్ళి కళ సంగతేమో కానీ..బొట్టు లేని దానమ్మ మాత్రం పెట్రోమాక్సు లైటులాగా వెలిగిపోతోంది.

* * *

పూరిల్లు కప్పు విప్పి పంతగాని సంగీతరావు తాటాకుల్తో కుదిమట్టంగా ఇల్లు కప్పితే, పుర్రే సుబ్బారావు ఇంటి చుట్టూ దడులు, ఆడోళ్ళకు నీళ్ళ దొడ్డి... సిమెంటు గోడంతా స్ట్రాంగుగా కట్టాడు. పెద్దారం పుట్ట మట్టి ఓ బండెడు గెడ్డం అంజయ్యతో తెప్పించి పేడ కలిపి గోడలు,అరుగులు, ఇంటా బయటా అలికి నాముతో ముగ్గులు పెట్టింది. మండిగాలకు పసుపు పూసి బొట్లు పెట్టింది. చెవిటి ఈరయ్య, గాలి సాంబయ్యలకు ఇంటి గోడలకు సున్నం కొట్టే పని అప్పజెప్పింది. కనగాల నుంచి తెచ్చిన సున్నం పాత బానలో కలిపి పూటకే పూసేసి ఇంకా సున్నానికి డబ్బులు తగ్గాయని తీసుకుని సారా బాపయ్య కొట్లో సెటిలయిపోయారిద్దరూ.

అత్తలూరి గోపాలరావు గారి గుదికట్ట మీదున్న తాటితోపు లోంచి గురకయ్య తాటాకులు కొట్టుకొస్తే, సోమయ్య సావాసగాళ్ళతో ఇంటి ముందు తాటాకు పందిరేపించింది. అనంతపురంలో టీచర్ ఉద్యోగం చేసుకుంటూ ఎండాకాలం భార్యపిల్లల్తో సెలవులకొచ్చే రాజారావు చేతికి రంగుల కాగితాలు తెచ్చిస్తే.. ఆయన వాటిని రకరకాల డిజైనులుగా, జెండాలుగా, విమానాలు, నక్షత్రాలుగా అందంగా కత్తిరించి ఇచ్చాడు. ఆ రంగు కాగితాలను పిల్లలంతా కలిసి... పురికొసకి వండిన మైదా పూసి అంటించారు. గాలికి రెపరెపలాడుతూ అవి మంగళ గీతాల్లా ధ్వనిస్తున్నాయి. పందిరి గుంజలకు మూగోడు కొబ్బరిమట్టలతో అందంగా జడలల్లి మామిడాకులతో తోరణాలు కట్టి.. కాఫీకి సరిపడా డబ్బులు తీసుకుని కనగాల గుప్తా హోటల్ కెళ్లిపోయాడు. పాలెం పొలం గట్టుమీదున్న సీమ చింత చెట్లను వారం రోజుల ముందే శ్రీరామ కోటయ్యతో పేళ్ళు వేయించి ఎండబెట్టింది. అవి ఎండిపోయి పెళపెళలాడుతున్నాయి.

పెళ్ళికి సొంగయ్య బ్యాండ్‌మేళంతో పాటు ఊరేగింపులో తురిమెళ్ళ ప్రకాశం వాయించే రాండోలు కూడా తప్పకుండా తేవాలని గుడ్డి బిక్షాలుకి బయనా యిచ్చి పంపింది వారం రోజులు ముందుగానే.

తూనుగుంట్ల రామ్మోహనరావు బట్టల దుకాణంలో ఇంట్లో అందరికి బట్టలు చింపించి పిల్లలవి, ఆడోళ్ళవి కుట్టడానికి కనగాల నుంచొచ్చే చెవిటి సాయిబుకిచ్చింది. సోమయ్యకు గులాబిరంగు టర్కీ టవల్, గ్లాస్కో పంచే తీసి, రెండు మీటర్ల టెరీకాటన్ తెల్ల

బట్ట మాత్రం చిట్టిబొమ్మల పిచ్చయ్యకిచ్చి నైలాన్ గుండీలు పెట్టి పొడుగు చేతుల చొక్కా కుట్టమంది.

అన్నం బంతి మీదికి బూందిలడ్డూలు, కారం బూంది కనగాల ధర్మం మిఠాయికొట్లో చెప్పి సరుకుకోసం పెళ్ళి ముందురోజు కుర్రోణ్ణి పంపుతా నంది దానమ్మ.

రామయ్య కొట్లోంచి ఐదుతావులు తెల్లకాగితాలు తెచ్చి నక్కా సూర్యనారాయణ చేత శుభలేఖలు రాయించి వాటికి నలుమూలల పసుపు రాసి... నాంచారయ్య నాగేసుకి... భ్రమరాంబ కొట్లో రెండు అద్దె సైకిళ్లిప్పించి, ఊళ్ల మీదకు పంపింది శుభలేఖలు పంచడానికి. ఆడోళ్ళంతా కలిసి తలోకపని అందుకోసాగారు. వసార్లో ఈతాకు చాపలు పరిచి, చాటల్లో బియ్యం చెరిగి బెడ్డలు, రాళ్ళు కొంతమంది ఏరుతుంటే... ఎండు మిరపకాయల కారం రోకల్లతో దంచేవారింకొందరు. ఇంకో రోళ్ళో అరిసెల కోసం నానేసిన బియ్యం దంచే ఆడోళ్ళు కొంతమంది. అరచేతి మందం అరిసెలు రాత్రంతా కడాయి ముందు కూర్చుని చేసింది దానమ్మ- వాటన్నింటిని కొత్తబానలో పెట్టి పసుపు రాసిన కొత్తగుడ్డ దాని మూతికి కట్టింది.

* * *

పెళ్ళి నలుగులు మొదలయినాయి. పేరంటాళ్ళు వచ్చి సోమయ్యకు పసుపు పూసి ఇంటిముందున్న తాటాకు పందిరికింద ముక్కాళ్ళ పీటమీద కూర్చోబెట్టి నలుగు పాటలందుకున్నారు. పెళ్ళి నలుగులు మొదలైన దగ్గర్నుంచి పెళ్ళి అయిపోయేదాకా పెళ్ళికొడుకు ఊరి పొలిమేర దాట్టానికి లేదు.

ఐదారు రాతిగాబులను తాటాకుల మీద లాక్కొచ్చారు కుర్రోళ్ళు.

దాదాపు పెళ్ళి పనులన్నీ అయిపోయినట్టే. రేపు లేదు ఎల్లుండే పెళ్ళి... రేపు పెళ్ళి కూతురింటికి ప్రదానం పంపాలి. ప్రదానంలోకి కావాల్సిన తమలపాకులు, రవిక గుడ్డలు, కొబ్బరి చిప్పలు, ఖర్జూరాలు, వక్కపొడితో పాటు పెళ్ళి కూతురికి పెడతానన్న 'నగ' కూడా పంపాలి. ఇంటికి చుట్టాలు ఒక్కొక్కరే రాసాగారు.


సింగుపాలెం నుంచి రావాల్సిన దానమ్మ చెల్లెలు జయమ్మ ఇంకా రాలేదు. వచ్చేపుడు రేపల్లె సుబ్బాచారి దగ్గర్నుంచి 'నానుతాడు'(నగ) తెమ్మని చెప్పింది చెల్లెలికి . చెల్లికి ఏమైందబ్బా? పెదలంక నుంచి కూతురు మనవళ్ళతో అబ్రహాం రిక్షాలో దిగింది. అరిటాకులు, అరటిగెలలు, పసుపు కొమ్ములు, కూరగాయలు దించి ఇంటిలో పెట్టాడు అబ్రహాం.

జయమ్మ కోసమే ఎదురుచూస్తోంది దానమ్మ.

''రేపు ప్రదానంతో పాటు 'నగ (నానుతాడు) పంపకపోతే మర్యాద దక్కదు. ఒకేల చెల్లెలు జయమ్మ 'నగ' మర్చిపోయివస్తే..? ఎందుకొచ్చిన ఇబ్బందిలే... నేను రేపల్లె పోయి దీపాలు పెట్టే ఏలకల్లా నగ తీసుకొస్తాలే'' అంది దానమ్మ కూతురితో.

''ఇపుడు నువ్వు పోకపోతే ఏమ్మా..? చిన్నమ్మ వత్తా వత్తా నగ తెచ్చుద్దిలే- పెళ్ళి ఇల్లు వదిలి నువ్వు పోకపోతే ఏమ్మా? తమ్ముడ్ని పంపుదాంలే'' అంది సొరాజ్యం.

''తమ్ముడు... పసుపు నీళ్ళు పడ్డాక పొలిమేర దాటకూడదమ్మ- పెళ్ళి పనులన్నీ అయిపోయినాయి. నగ తీసుకొని మాపిటేల కొత్తాగా'' అంటూ బయలుదేరి రేపల్లె వెళ్ళిపోయింది దానమ్మ. ఇంట్లో పని సొరాజ్యం చూసుకోసాగింది.



* * *

తెల్లారింది. దానమ్మ తిరిగిరాలేదు.

తాటాకు పందిరికింద పేడకల్లాపిజల్లి పొడి ముగ్గులేసింది సొరాజ్యం... కుర్రోళ్ళు గాబుల్లో మంచినీళ్ళు నింపారు.

పిల్లలంతా పందిరి గుంజలు పట్టుకొని గిరగిరా తిరుగుతూ ఆడుకుంటున్నారు. పెళ్ళి పందిరి చుట్టాలు, పిల్లలతో సందడిసందడిగా ఉంది.

గాడిపొయ్యి మీద ఉప్మాకి ఎసరుపోశాడు పడమటి ఎంకయ్య. చుట్టాలెవరొచ్చినా... ఇంటిముందు ఏ రిక్షా ఆగినా అమ్మ వచ్చిందేమోనని- చేస్తున్న పనాపి వచ్చి చూస్తోంది సొరాజ్యం.

మధ్యాహ్నం అన్న పేలకృకుడా దానమ్మ రాకపోతే..

''సైకిలేసుకుని రేపల్లె వెళ్ళొత్తానక్కా'' అన్నాడు సోమయ్య.



''వద్దులేరా నువ్వు పసుపుబట్టల్తో పొలిమేర దాటకూడదు. నాగేసన్ననో, చెంచయ్య మావనో పంపుతాలే'' అంది సారాజ్యం.

''నిన్ననంగా ఎల్లింది రాలేదంటే 'నగ' పని కాలేదేమో?'' అన్నాడు సోమయ్య.

''రాత్తిరికి ఇసకపల్లిలో సీతమ్మ అత్త ఇంట్లో ఉండి తెల్లారి పొద్దున్నే వచ్చుద్దిలే అయ్యా'' అంది సోమయ్య పెద్దమ్మ భాగ్యం.

సోమయ్యకి ఏమీ తోచడం లేదు. దిగులుగా అరుగుమీద కూర్చున్నాడు. సావాసగాళ్ళకు కిళ్ళీలు, సిగరెట్లు ఇవ్వడానిక్కూడా వెళ్లబుద్ధికాక సుధాకర్‌తో పంపాడు.

''అయ్యో! సుభమా అని పెళ్ళి జరుగుతుంటే అట్టా దిగాలు మొగమేసుకుని కూచోగూడదురా... కూసింత నవ్వుతూ... సావాసగాళ్ళతో తిరుగయ్యా! ఇదిగో ఉప్మా తిని గూసేపట్టా తిరిగిరా!'' అంటూ అరిటాకులో పెట్టి ఉప్మా ఇచ్చింది భాగ్యం. తిన బుద్ధికాక పక్కనే పెట్టాడు సోమయ్య.

హడావిడిగా కులపెద్ద ఎంకటసుబ్బయ్య వచ్చాడు. ఆయనతో పాటు ఆరుగురు పెద్దలు, గరికి బుడ్డి పున్నమ్మ కూడా వుంది. అందరినీ భోజనాలకు కూర్చోబెట్టింది సారాజ్యం. లడ్డులు, అరిసెలు, గారెలు, ముద్దపప్పు నెయ్యి, పచ్చి పులుసుతో తృప్తిగా భోంచేసి చెయ్యి కడుక్కుంటూ ''దానమ్మ ఏదమ్మా కనబడ్డం లేదు'' అన్నాడు కులపెద్ద.

''పతానంలోకి 'నగ' తీసుకొత్తానని నిన్ననంగా రేపల్లె వెళ్ళింది పెద్దయ్యా ఇంకా రాలేదు'' చెప్పింది సారాజ్యం.

పెళ్ళి పెద్దలంతా ఆకుల వక్కలు నములుతూ... పందిరి కింద వేసిన నులక మంచాలమీద కూర్చున్నారు. అంతకు పదిరోజుల ముందే చనిపోయిన నెహ్రూ గారి గురించి.. ఆయన పరిపాలన గురించి మాట్లాడుకోసాగారు.

నిన్ననంగా వెళ్ళిన దానమ్మ రాలేదు. ఆమె 'నగ' తెస్తేగానీ ప్రదానం కదలదు. మాటలయిపోయి కొంతమంది కునుకు తీస్తుంటే, చుట్ట ముట్టించు కోవడానికన్నట్టు దోనే యానాది ఇంటివైపు వెళ్ళారు మరొక ఇద్దరు.

సూర్యుడు పడమటివైపునకు వంగాడు. పొలాలకెళ్ళిన గొడ్లు తిరిగొస్తున్నాయి. పెళ్ళి పెద్దలంతా అంజయ్యగారి తాటి తోపులోని దేవరతాటి కిందకు జేరారు. అక్కడ కొంతమంది కుర్రోళ్ళు జేరి కల్లు తాగుతున్నారు. తలొక బందరు గ్లాసు కల్లు తాగి తిరిగొచ్చారు పెద్దలు.

''పొద్దుగూకక ముందే ప్రదానం పొలిమేర దాటాలమ్మ- అక్కడికి ప్రదానం పోకపోతే పెళ్ళి కూతురింట్లో కంగారుపడతారు. తొందరగా ఏదొకటి కానీండి. ఏదొక నగేసి ప్రదానం మూట కట్టండని'' కుల పెద్ద ఎంకట సుబ్బయ్య హడావిడి చేస్తున్నాడు.

''ఎవరిదో ఎందుకు నా'నగే'ప్రదానం మూటలో పెట్టండి మావా! నా చెల్లెలి కొడుకు నా కొడుకు కాదా?'' అంటూ మెడలో నగ తీసిచ్చింది భాగ్యం. దాన్ని ప్రదానం మూటలో మిగిలిన వాటితో పాటు కలిపిపెట్టాడు కులపెద్ద- పర్రె సుందరమ్మ తీసుకెళ్తున్న పెళ్ళి పెద్దలకు ఎదురొచ్చింది. ప్రదానం ఊరు దాటింది.

* * *

ఆ రాత్రి పెళ్ళి నలుగు సలగాల ఆదియ్యా ఇంట్లో వేశారు. పేరంటాల పాటలు, నలుగు స్నానాలు, భోజనాలయి సోమయ్య ఇంటికొచ్చేసరికి పది గంటలయింది. ఇంటికి వచ్చీరాగానే ''అమ్మ వచ్చిందా అక్కా?''అనడిగాడు సోమయ్య.

''ఇంకా రాలేదురా! నగ పని కాలేదేమో? రేప్పొద్దున వచ్చుద్దిలే!'' అంది సారాజ్యం.

ఇంటి ముందు సైకిల్ బెల్లు మోగింది. రేపల్లె సుబ్బాచారి దగ్గరికెళ్ళిన నాగేసు, నాంచారయ్య తిరిగొచ్చారు.

''అమ్మ కనబడిందా అన్నా?'' ఆత్రంగా అడిగాడు సోమయ్య.


''పొద్దున్నే నగ తీసుకొని వచ్చిందని చెప్పాడే సుబ్బాచారి గారు'' చెమట తుడుచుకుంటూ చెప్పాడు నాగేసు.

''ఇంత టైంపట్టదే.. ఇంకేమన్న పనులుండి ఆగిపోయిందేమో. రాత్రికి ఇసకపల్లిలో ఉండి రేపొచ్చుద్దిలే'' అన్నాడు నాంచారయ్య.

''పెళ్ళి పనులన్నీ అయిపోయినాయి అన్న. ఇంకేం లేవు. పనయిపోతే ఇంటికి రాకుండా ఒక్క గడియ ఆగదే అమ్మ'' అంది సారాజ్యం.

''సరే లేరా.. ఈ రాత్తిరికాడ వచ్చి సేసేదేముంది. చేతులు, కాళ్ళు కడుక్కురండి, అన్నం తిందురుగానీ'' అని విస్తరాకులేసింది భాగ్యం.

పందిరి కింద కొంతమంది, అరుగుల మీద



కొందరు, ఇంట్లో కొందరు పడుకున్నారు.

* * *

'సీతారాముల కళ్యాణం చూతము రారండి' మైకులోని పాటకు అందరికీ మెలకువ వచ్చేసింది. సొరాజ్యం పందిట్లో కళ్ళాపి జల్లి ముగ్గులేసింది. కుర్రోళ్ళు బావి దగ్గర్నుంచి కావిళ్ళతో నీళ్ళు తెచ్చి గాబులు నింపుతున్నారు.

ఆడోళ్ళు పంచలో ఈతాకు చాపలు పరిచి కూరగాయలు తరుగుతున్నారు. గాడిపొయ్యి రాజేసి ఉప్మాకు ఎసరుపోశాడు ఎంకయ్య.

మైకు పాటలకు ఒకరిమాటలు ఒకరికి సరిగ్గా అర్థం కాక పెద్దపెద్దగా మాట్లాడుకుంటున్నారు. పెద్దారం సొంగయ్య బ్యాండుమేళం పందిట్లో దిగింది. పిల్లలంతా పందిరికింద గోలగోలగా ఆడుకుంటున్నారు. సొంగయ్య బ్యాండ్‌మేళం ట్రూపు నాలుగు పాటలు వాయించి, సామాను సర్ది టీలు తాగటానికి ఊర్లోకి వెళ్ళిపోతుంటే, కులపెద్ద ఎంకటసుబ్బయ్య వచ్చి, పెళ్ళి కూతురు వచ్చి గడ్డం ఆనందం ఇంట్లో విడిదికి దిగిందని చెప్పి బ్యాండ్‌మేళం, పానకంతో బయలుదేరి వెళ్ళి పెళ్ళికూతుర్ని తీసుకొచ్చారు.

పెళ్ళికొడుకు, పెళ్ళికూతురిని పీటలమీద పందిరికింద కూర్చోబెట్టి, నలుగేసి మంగళస్నానాలు చేయించారు. పెళ్ళికూతుర్ని... పెళ్ళికొడుకుని ఇంట్లో అలంకరిస్తున్నారు. సోమయ్య చొక్కా జేబులో చార్మినార్ సిగరెట్టు ప్యాకెట్టు ఉబ్బెత్తుగా ఉంది. దానిమీద వంద నోటు మెరుస్తోంది.

పెళ్ళి భోజనాలకి ఊరి జనమంతా వచ్చారు. పందిరి కింద అందరికీ భోజనాలు పెట్టారు. లడ్డూలు, అరిసెలు, పాయసంతో తృప్తిగా తిన్నారు. తర్వాత ఆడవాళ్ళ బంతికూడా లేచింది.

పందిట్లో పెళ్ళిపీటల మీద కూర్చున్నాడు పెళ్ళికొడుకు సోమయ్య. ధూళిపూడి నుంచి వచ్చిన పెద్దదాసు మంత్రాలు చదువుతూ.. ఏమేం కావాలో సొరాజ్యానికి చెబుతున్నాడు. సోమయ్య ముఖం దిగులుగా ఉంది. ఎదురుగా పెళ్ళి కూతురు కూర్చుంది. చుట్టూ సావాసగాళ్ళు చేరారు. పెళ్ళి కూతురికి ఇద్దరు పిల్లలు విసనకర్రలు విసురుతున్నారు. ఆమె వంచిన తల ఎత్తడం లేదు.

అంతకుముందే వచ్చిన సోమయ్య చిన్నమ్మ జయమ్మ దగ్గరుండి.. ఎవరికేది కావాలో అందిస్తోంది.

''అక్కా అమ్మ వచ్చిందా?'' అనడిగాడు సోమయ్య, సొరాజ్యాన్ని దూరంగా ఉన్న జయమ్మని చూసి-

''భోజనాలకి ముందే వచ్చిందిగా నువ్వు చూడలేదా? దగ్గరుండి అందరికీ వడ్డించిందిగా! భోజనాలు బాగా కుదిరినయ్! ఇప్పటిదాకా ఇక్కడే ఉంది. ఆకులు, వక్కలు తేవడానికి ఇంట్లోకెళ్ళి నట్టుంది'' చెప్పింది సొరాజ్యం.

దాసు ముఖం వెలిగిపోయింది.

పంతులు హుషారుగా మంత్రాలు చదువుతున్నాడు. పెళ్ళి అక్షింతలు పళ్ళెంలో అందించింది సోమయ్య చిన్నమ్మ జయమ్మ. పెళ్ళిమంత్రాలు మైకులో మారుమోగుతున్నాయి.

సోమయ్య నవ్వుతూ పెళ్ళికూతురు వంక చూస్తున్నాడు. ఆమె సిగ్గుతో అసలు తల ఎత్తడం లేదు.

''ఇంక సోమయ్య చూపులన్నీ అటేరోయ్!'' అంటూ ఎకసెక్కాలు చేస్తున్నారు పక్కనే ఉన్న సోమయ్య సావాసగాళ్ళు.

మంగళ సూత్రధారణ జరిగింది. అందరూ అక్షింతలేశారు.

సావాసగాళ్ళు తెచ్చి వేసిన రంగు కాగితాలు, మల్లెపూలు, బిస్కెట్ల దండలతో సోమయ్య, పెళ్ళి కూతురు మునిగిపోయారు. పక్కన జేరిన పిల్లలు పోటాపోటీగా విసనకర్రలు విసరసాగారు. వారి చూపులన్నీ బిస్కెట్ల దండల మీదే!

అత్తరు వాసనతో పాటు... మల్లెపూల వాసన కలిసి పందిరంతా గుభాళిస్తోంది.

పెళ్ళి ఊరేగింపుకి బ్యాండ్‌మేళం ట్రూపు శృతి చేసుకుంటున్నారు. ఊరేగింపు ఎక్కడెక్కడ ఆపాలో, రాండోలుని ఎక్కడెక్కడ వాయించాలో సొంగయ్యకి వివరంగా చెబుతున్నాడు కులపెద్ద ఎంకటసుబ్బయ్య. పెళ్ళి తంతు అయిపోయింది. తలంబ్రాలు ఒకళ్ళ నెత్తిమీదొకరు పోసుకుంటున్నారు పెళ్ళి కొడుకు, పెళ్ళి కూతురు.

''ముందుగా అమ్మకు దండం పెట్టండయ్యా. అంతా దాని కష్టమే! నీ పెళ్ళి చూడాలని ఎంతగా ఇదయిపోయిందో అది!'' అంది పెళ్ళికొడుకు పెద్దమ్మ భాగ్యం.

అమ్మ కోసం గుమ్మం దగ్గర నిలబడ్డారు పెళ్ళి కొడుకు, పెళ్ళి కూతురు.

దానమ్మ కనబడలేదు.

''ఇప్పుడుదాకా ఇక్కడే ఉందిగా ఇంతలో ఎటెళ్ళింది అమ్మ'' అడుగుతోంది సొరాజ్యం, చిన్నమ్మ జయమ్మని.

''అమ్మ వచ్చిందా? నాకు కనబడలేదే'' అంది పొద్దున్నే సింగిపాలెం నుంచి వచ్చిన జయమ్మ.

''అమ్మ అక్షింతలు తేవడం నేను చూశా చిన్నమ్మా'' చెప్పాడు సోమయ్య.

''ఇందాక భోజనాల దగ్గర చిలకాకుపచ్చ చీర కట్టుకుని, అందరికీ వడ్డించిందిగా'' చెప్పింది సొరాజ్యం.

''అక్షింతలు తెచ్చింది నేనేగదయ్యా'' చెప్పింది జయమ్మ.

అంతలో ఒక పాతజీపు వచ్చి ఇంటిముందు ఆగింది. పిల్లలంతా బిలబిలా ఆ జీపు చుట్టూ మూగారు. ఇంజను ఆపకుండా దిగిన డ్రైవరు పిల్లలను జీపు దగ్గరకు రాకుండా తరుముతున్నాడు.

జీపులోంచి ఇద్దరు ఖాకీ డ్రెస్సులేసుకున్న కానిస్టేబుళ్ళు దిగారు. వాళ్ళు పెళ్ళిపందిరి దగ్గరికొచ్చి ''దాసరి దానమ్మ ఇల్లు ఇదేనా?'' అంటూ చిట్టీ చూపించారు.

చుట్టాలు, ఊరోళ్ళంతా వారి చుట్టూ మూగారు.

''ఇదే... మొన్ననంగా నగకోసం రేపల్లె వెళ్ళింది. ఆమె ఇంకా తిరిగిరాలేదు'' చెప్పాడు కులపెద్ద ఎంకట సుబ్బయ్య.

''నిన్న పల్లెకోనడొంక దగ్గర నగల కోసం దొంగలు ఆమెను చంపేశారు. ఈమె చేతిలో నగల దుకాణం సుబ్బాచారి రాసిన అడ్రస్ కాగితం చూసి పోలీసు కేసయినాకా తీసుకొచ్చాం'' చెప్పాడు ఒక కానిస్టేబుల్.

జీపులో ఈతాకు చాపలో చుట్టిన శవాన్ని కిందికి దించారు కుర్రోళ్ళు.

''మన దానమ్మే'' అంటూ భోరున ఏడ్చారు ఆడోళ్ళు. ఏడ్పులు విని అక్కడికి పెళ్ళి బట్టలతో వచ్చిన సోమయ్య, చిలకాకుపచ్చ చీరలో ఉన్న తల్లి శవాన్ని చూసి కుప్పకూలిపోయాడు.

దానమ్మను దొంగలు చంపేశారన్న వార్త గుప్పుమంది- క్షణాల్లో ఊరంతా గుమిగూడింది.

''పెళ్ళి భోజనాల్లో దానమ్మని నేను చూశానని'' కొత్త స్థలాల్లో ఉండే రాగమ్మంటే, ''అక్షింతలు తేవడం నేను చూశానని ''పక్కనున్న కోటమ్మ ఏడుస్తూ చెబుతోంది.

దానమ్మ గురించి తలోరకంగా మాట్లాడు కోసాగారు.

శవస్నానం చేయించి సోమయ్య పెళ్ళి దండలు దానమ్మకు వేసి పాడెక్కించారు.

అత్తరు జల్లారు... పూలేశారు.

పెళ్ళి ఊరేగింపు శవయాత్రగా మారింది!

★

